

## ప్రజా సంక్షేమానికి పెద్ద పీట

- మహిళల అభ్యున్నతికి కృషి
- జిల్లా అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికే ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మహిళల అభ్యున్నతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. మండలంలో మంత్రి సోమవారం పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు కలెక్టర్ దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కల్యాణితో కలిసి శ్రీకారం చుట్టారు. జగ్గన్నపేటలో సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన సామాజిక నీటిశుద్ధి కేంద్రాన్ని, వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కుట్టు పనిలో శిక్షణ తీసుకున్న 175 మంది మహిళలకు ఉచితంగా మిషన్లు పంపిణీ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గ్రామంలోని ఎనిమిది మంది పాడి రైతులకు తొమ్మిది యూనిట్ల గేదెల కొనుగోలుకు సబ్సిడీ రుణాలను మంజూరు చేశారు. 32 మహిళా స్వయం సహాయక సంఘాల 321 సభ్యులకు

## సమస్యలను పరిష్కరించాలి

ములుగు కలెక్టర్ దివాకర



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై ప్రజలు ప్రజావాణిలో అందించిన వినతులపై దృష్టిసారించి, వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ దివాకర ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన వినతులు స్వీకరించారు. వాటిపై సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయా సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 56 వినతులు వచ్చాయి. భూ సమస్యలు 17, గృహనిర్మాణశాఖకు సంబంధించినవి 11, పెన్షన్ ఐదు, ఉపాధి కల్పన మూడు, ఇతర శాఖలకు సంబంధించినవి 20 రాగా వాటిని కలెక్టర్ స్వీకరించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేశ్, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రగతి చక్రం ప్రమాదాల పయనం



భూపాలపల్లి డిపో నుంచి మహాముత్తారం మండలం బోర్లగూడేనికి వెళ్లే బస్సులో ప్రయాణికుల రద్దీ

కృష్ణకాలనీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం అనేది ఆ సంస్థ నినాదం. ఆర్టీసీ బస్సు ప్రయాణమంటే భద్రతకు భరోసా అని అంటోంది. అయితే.. ఇటీవల తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు మాత్రం ప్రయాణికులను కలవరపెడుతున్నాయి. చేవేళ్ల ఘటన రాష్ట్రంలోనే కలకలం రేపగా ఈ ప్రమాదంతో ఆర్టీసీకి కనువిప్పు కలగలేదని తెలుస్తోంది. అతి వేగం, ఓవర్‌లోడ్ యథేచ్ఛగా కొనసాగుతూనే ఉన్నాయి. భూపాలపల్లి జిల్లాలో ఆర్టీసీ బస్సులు ఓ వైపు వేగం, మరోవైపు పరిమితికి మించి ప్రయాణాలతో రాకపోకలు సాగిస్తున్నాయి. డిపో అధికారులు దృష్టి సారించకపోవడం వల్ల ఎక్కడో చోట చిన్నచిన్న ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అనుకోని పెద్ద ప్రమాదాలేమైనా జరిగితే బాధ్యత ఎవరనే ప్రశ్న తలెత్తుతోంది.

### మించుతున్న పరిమితి

ఆర్టీసీ బస్సు రాకపోకలు ఆందోళన కలిగిస్తున్నాయి. భూపాలపల్లి డిపో నుంచి వివిధ ప్రాంతాలకు బస్సులు అధిక వేగంతో వెళ్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఒక్కో బస్సు 50 మందిని మాత్రమే చేరవేయాల్సి ఉండగా పరిమితికి మించి 70-100 మందిని ఎక్కిస్తున్నారని తెలుస్తోంది. ఫలితంగా ప్రయాణికులు అనేక రకాల ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రధానంగా హనుమకొండ, కాళేశ్వరం వైపు వెళ్లే బస్సుల్లో వేగం అధికంగా ఉంటోందని విమర్శలు వస్తున్నాయి. ఈ రహదారిలో వచ్చి వెళ్లే బస్సులు గతంలో ప్రమాదాలకు గురైన ఘటనలు సైతం ఉన్నాయి. పెద్దగా ప్రాణ నష్టాలేవీ చవిచూడకపోయినా గాయాలపాలైన వారున్నారు.

### రోజూ 36 వేల మంది ప్రయాణాలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళల సంఖ్య పెరిగిపోయింది. భూపాలపల్లి జిల్లాలోని 12 మండలాల నుంచి రోజూ సగటున 36 వేల మంది ఈ ఉచిత ప్రయాణాన్ని పొందుతున్నారని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. భూపాలపల్లి డిపో నుంచి వరంగల్, హనుమకొండ, హైదరాబాద్, కాళేశ్వరం, గోదావరిఖని, మంథని ప్రాంతాలతో పాటు జిల్లా పరిధిలోని వివిధ గ్రామాలకు సైతం డిపో నుంచి నిత్యం బస్సుల రాకపోకలు సాగుతున్నాయి. పల్లెలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు పరిమితంగా ఉండటంతో ఈ బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. పరిమితికి రెండింతలు ఒక్కో బస్సులు ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం డిపోపరిధిలో మొత్తంగా 76 ఆర్టీసీ, 24 అద్దె బస్సులు నిరంతరాయంగా సేవలందిస్తున్నాయి.



- బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులు
- కలవర పెడుతున్న వరుస ఘటనలు
- ఆర్టీసీకి కలగని కనువిప్పు
- భూపాలపల్లి డిపోలో 76 ఆర్టీసీ, 24 అద్దె బస్సులు
- రోజూ సగటున 36 వేల మంది ప్యాసింజర్లు

### పండగల వేళ మాత్రమే రద్దీ

- ఇందు, డిపో మేనేజర్ భూపాలపల్లి

ఏదేని పండగల వేళ మాత్రమే బస్సుల్లో ఎక్కువ ప్రయాణికులు కనిపిస్తుంటారు. ప్రతి ఫెస్టివల్‌కు రద్దీకి సరిపడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. బస్సులు అతివేగంగా వెళ్తున్నాయని గానీ, అధికంగా ప్రయాణికులు ఎక్కుతున్నారని గానీ ఏమీ లేదు. డ్రైవర్లకు ం జాగ్రత్తలు, సూచనలు చేస్తూనే బస్సులను అన్ని రూట్లకూ సమర్థంగా నడిపిస్తున్నాం.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావ్ - 6లో

## మాజీ సర్పంచ్ భార్యపై కత్తితో దాడి

హత్యాయత్నం కేసు నమోదు



కాటారం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం మాజీ సర్పంచ్ తెప్పల దేవేందర్‌రెడ్డి భార్య లక్ష్మిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..

దేవేందర్ రెండుసార్లు గంగారం సర్పంచ్‌గా పని చేశారు. ఈ క్రమంలో ఆయన, చల్ల శేఖర్ అనే వ్యక్తి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో తాను చేసే సెటిల్‌మెంట్లలో తలదూర్చి నష్టం కలిగిస్తున్నావంటూ దేవేందర్‌తో శేఖర్ పలుమార్లు గొడవలు పెట్టుకున్నాడు. ఎప్పటికైనా నీ కుటుంబం అంతుచూస్తానని బెదిరించాడు. అయినా దేవేందర్ పట్టించుకోలేదు. ఇదే క్రమంలో సోమవారం రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని భూడిదపల్లిలో ఉన్న ఇంటి నుంచి దేవేందర్ భార్య లక్ష్మి పొలం వైపు నడుచుకుంటూ వెళ్తుండగా శేఖర్ బైక్‌పై అనుసరించాడు. పాత కక్షలను మనసులో పెట్టుకున్న అతడు బైక్‌ను ఆపి అందులో ఉన్న కత్తిని తీసి 'నిన్ను, నీ మొగుడిని చంపుతా' అంటూ దుర్భాషలాడుతూ దాడి చేశాడు. లక్ష్మి తప్పించుకునే ప్రయత్నం చేయగా చేతి మణికట్టుపై గాయాలయ్యాయి. ఆమె కేకలు వేయడంతో అక్కడే ఉన్న పలువురు పరుగెత్తుకుంటూ వెళ్లగా శేఖర్ పారిపోయాడు. లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శేఖర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

## మహిళలకు వడ్డీ లేని రుణాలు

- రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభం
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి





ఉపముఖ్యమంత్రి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌శర్మ, ఇతర అధికారులు

భూపాలపల్లిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఈనెల 25 నుంచి వడ్డీలేని రుణాలు అందించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ నుంచి సోమవారం ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా భూపాలపల్లి నుంచి కలెక్టర్ రాహుల్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రుణాల పంపిణీ కార్యక్రమాన్ని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఘనంగా ఏర్పాట్లు చేయాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుని సమాచారం ఇవ్వాలన్నారు. వడ్డీలేని రుణాలు పంపిణీ కార్యక్రమానికి మండల సమాఖ్యలు, గ్రామ సమాఖ్యల ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. గత ప్రభుత్వం వడ్డీలేని రుణ పంపిణీ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే దానిని పెద్ద ఎత్తున పునరుద్ధరించిందని అన్నారు. ఈ చొరవ రాష్ట్ర వ్యాప్తంగా మహిళల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యాన్ని తెచ్చిపెట్టిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వయం సహాయం సంఘాల సభ్యులకు రెండు, మూడు దశల్లో వడ్డీలేని రుణాలు ఇప్పటికే పంపిణీ చేశామని (మిగతా 8వ పేజీలో..)

## మేడారంలో ఎస్పీ పర్యటన

జాతర పరిసరాలు, రహదారుల పరిశీలన



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

వివరాలు 7వ పేజీలో..

## వందేమాతరం గీతం స్ఫూర్తిదాయకం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిషీధర్‌రెడ్డి



ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిషీధర్‌రెడ్డి, పార్టీ శ్రేణులు

చిట్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వందేమాతర గీతం స్ఫూర్తిదాయకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిషీధర్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం వందేమాతర గేయం 150 సంవత్సరాల స్మారకోత్సవ ర్యాలీని నిర్వమించారు. ముఖ్య అతిథిగా హాజరైన నిషీధర్‌రెడ్డి మాట్లాడుతూ బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతర గేయం యువతలో జాతీయభావాన్ని పెంపొందిస్తోంద, ఉద్యమాలకు ప్రేరణ ఇచ్చిందని అన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్, జిల్లా కార్యదర్శి సుదగాని శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రావుల రాకేష్, టేకుమట్ల మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు, నాయకులు చెక్క నర్సయ్య, మండల మొగిలి, పెండ్యాల రాజు, గుండ సురేష్, తీగల జగ్గయ్య, మల్లేష్, అశోక్‌చారి, చింతల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మెస్ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల విద్యార్థుల కోసం మెస్ నిర్వహించేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల మెస్ కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేసింది. డిసెంబరు 2లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

## రేపు సింగరేణి బీసీ, ఓబీసీ బ్రాంచి కమిటీ సమావేశం

కృష్ణకాలనీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి సెక్యూరిటీ ఆఫీసు సమీపంలో ఈనెల 26న సింగరేణి బీసీ, ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ బ్రాంచి కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కె.నవీన్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎస్. మురళీమోహన్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడలు అమిరిశెట్టి నాగేశ్వర్‌రావు, జనరల్ సెక్రటరీ నల్లపూరి రమేష్ హాజరవుతారన్నారు. సమావేశంలో అన్ని గనులకు పిట్ కమిటీలను ఎన్నుకోవడం, రాజ్యాంగబద్ధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం, ఎండీ క్వార్టర్స్ వద్ద ఉన్న నూతన గ్రౌండ్‌కు జ్యోతిరావు పూలే పేరు పెట్టడం తదితర అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు.



సీఆర్పీఎఫ్ క్యాంపు కోసం జరుగుతున్న ఏర్పాట్లు

## మురుమూరులో సీఆర్పీఎఫ్ క్యాంప్

- మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా ఏర్పాటు
- నేడు ప్రారంభించే అవకాశం

వాజేడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టింది. కర్రెగుట్టల్లో ఈ ఏడాది మార్చిలో వేటను ప్రారంభించింది. ఎన్నడూ చూడనంత నష్టాన్ని మావోయిస్టు పార్టీ చవిచూసింది. వరుస ఎన్‌కౌంటర్లు, అగ్రనేతల లొంగుబాట్లతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ క్రమంలో మావోయిస్టుల లక్ష్యంగా ఏజెన్సీ ప్రాంతంలో కేంద్ర బలగాల్లో ఒకటైన సీఆర్పీఎఫ్ క్యాంప్‌ను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ములుగు జిల్లా వాజేడు మండలంలోని కర్రెగుట్టలకు దగ్గరగా ఉన్న మురుమూరు అటవీ ప్రాంతంలో సీఆర్పీఎఫ్ క్యాంప్ ఏర్పాటు చేసేందుకు సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్యాంపును మంగళవారం ప్రారంభించే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీని ఏర్పాటుతో మావోయిస్టుల కార్యకలాపాలకు మరింతగా అడ్డుకట్ట పడే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మురుమూరు అటవీ ప్రాంతంలో తొలుత సీఆర్పీఎఫ్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి అనంతరం వెంకటాపురం మండలంలోని గుట్టలపై ఉన్న పామునూరులో మరో క్యాంప్ ఏర్పాట్లు చేస్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ రెండు క్యాంప్‌ల ఏర్పాటుతో కర్రెగుట్టల వద్దకు సులువుగా బలగాలు వెళ్లేందుకు దోహదపడతాయని తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం కర్రెగుట్టలను టూరిస్ట్ హబ్‌గా మార్చేందుకు చర్యలు చేపడుతున్న తరుణంలో ఈ సీఆర్పీఎఫ్ బలగాల క్యాంప్‌ల ఏర్పాటుకు ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే వెంకటాపురం సర్కిల్ పరిధిలో వాజేడు, పేరూరు, వెంకటాపురంలో మూడు పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఇదే సర్కిల్ పరిధిలో ఆలుబాకలో సైతం సీఆర్పీఎఫ్ క్యాంప్ ఉంది. ఇప్పుడు మరో క్యాంప్ ఏర్పాటుతో ఏజెన్సీ ప్రాంతంలో అడుగడునా పోలీసు ఆంక్షలు ఉండబోతున్నట్లు తెలుస్తోంది.

## కలెక్టరేట్ వద్ద హమాలీల ధర్నా




కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న హమాలీలు

ములుగు టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. దీనికి ముందు జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ధర్నా అనంతరం అదనపు కలెక్టర్ మహేందర్‌జీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలైన ఐకేపీ, పీఏసీఎస్, జీసీసీ, సివిల్ సప్లయ్ వద్ద హమీలతోపాటు బజార్ ముఠా హమాలీలకు అందరికీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందుకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు గిగ్ వర్కర్లకు మాదిరగా హమాలీలకు కూడా వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీలు రఘు, చిన్ని, స్వామి, సారయ్య, రాములు, బాలరాజు, శ్రీధర్, లక్ష్మణ్, శేఖర్, అయిలయ్య, లింగయ్య, సుధాకర్, అల్లం కుమార్, మొగిళి, సిఐటియూ నాయకులు పాల్గొన్నారు.



ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

## ఐటీడీఏ భవనాన్ని తరలించొద్దు

తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్

ఏటూరునాగారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ భవనాన్ని తరలించొద్దని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఐటీడీఏ కార్యాలయంలో ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ఈ మేరకు సోమవారం ధర్నా జరిగింది. అనంతరం ఐటీడీఏ ఏపీవో జె.వసంతరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ నూతన ఐటీడీఏ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. అయితే, ప్రస్తుతం ఆకులవారిఘణపురంలో ఉన్న ఐటీడీఏ భవనం ఆదివాసీల అస్తిత్వానికి చిహ్నంగా ఉందన్నారు. దీనిని తరలించడం వల్ల ఆదివాసీలు తమ అస్థిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చుట్టుపక్కల మండలాలకు ప్రస్తుతం ఉన్న భవనమే సెంటర్ పాయింట్‌గా ఉందని తెలిపారు. కొమురంభీం మీని స్టేడియం ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల క్రీడలకు, స్థానికుల వ్యాయామానికి, వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సభలు, సమావేశాలకు ఎంతో ఉపయోగపడుతోందని వివరించారు. స్టేడియం స్థలంలో ఐటీడీఏ భవనాన్ని నిర్మిస్తే స్థానిక ప్రజలు గ్రౌండ్‌ను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు చందా మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కావుల సమ్మయ్య, ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమురం లక్ష్మీకాంత, జిల్లా అధ్యక్షురాలు పోషెట్టి అనసూయ, ఐలాపూర్ మాజీ సర్పంచ్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

### డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి సీతక్క

ములుగు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. డీఆర్‌డీఏ అధికారులతో ఇద్దరు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భట్టి విక్రమార్క హైదరాబాద్ నుంచి పాల్గొనగా, ములుగు జిల్లా పర్యటనలో ఉన్న సీతక్క ఏటూరునాగారం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ మహిళా స్వయం సంఘాల ఖాతాల్లో రూ. 304 కోట్లు జమ చేశామన్నారు. ఆడ బిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వేల కోట్ల రూపాయల నిధులు సమకూర్చుతున్నామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీల భారం లేకుండా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రుణాలపై వడ్డీలు ప్రభుత్వమే చెల్లిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ. 3,500 కోట్ల వడ్డీలను ఎగవేసిందని విమర్శించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు కూడబెట్టుకున్న పొదుపు సొమ్మును కూడా కాజేసిందని ఆరోపించారు. అభయహస్తం నిధులు గత ప్రభుత్వం మింగేసిందన్నారు. ఆడబిడ్డల కష్టాన్ని కాజేసి, వారి కన్నీళ్లకు కారణమైన బీఆర్ఎస్ పెద్దలకు మహిళా సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు లేదని వ్యాఖ్యానించారు.

## కన్నెపల్లిలో అంతరాష్ట్ర సివిల్ సప్లయ్ చెక్‌పోస్టు




చెక్‌పోస్టును ప్రారంభిస్తున్న సివిల్ సప్లయీస్ అధికారి కిరణ్‌కుమార్

మహదేవపూర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలం కన్నెపల్లిలో సివిల్ సప్లయ్ అంతరాష్ట్ర చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. దానిని పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి కిరణ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. మహారాష్ట్ర నుంచి ధాన్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ బృందాలు రెండు షిఫ్టులుగా 24 గంటలు ఈ తనిఖీ కేంద్రం వద్ద పర్యవేక్షిస్తారని కిరణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, ఏవో సుప్రజ్యోతి, సివిల్ సప్లయీస్ డీఎం రాములు, కాళేశ్వరం ఎస్సై తమాషరెడ్డి పాల్గొన్నారు.

## బక్క జడ్సన్‌ను బేషరతుగా విడుదల చేయాలి

జనగామ కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సామాజిక కార్యకర్త బక్క జడ్సన్‌ను బేషరతుగా విడుదల చేయాలని జిల్లా రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సోమవారం ప్రభుత్వాన్ని ఒక ప్రకటన ద్వారా డిమాండ్ చేసింది. 2024 మార్చి నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని గవర్నర్ కార్యాలయంలో మూడుసార్లు మెమోరాండం ఇచ్చినా స్పందించకపోవడంతో మరోసారి రాజ్‌భవన్‌కు ఆధారాలతో వెళ్లిన జడ్సన్‌ను రాజ్‌భవన్‌లోకి అనుమతించక అరెస్టు చేయడం తగదన్నారు.

కాగ్ రిపోర్టు ప్రకారం 2024-25 ఆర్థిక బడ్జెట్‌లో సుమారు రూ.12,800 కోట్లు రిటైర్ అయిన ఎంప్లాయిస్‌కు బడ్జెట్‌లో నిధులు విడుదల చేశారన్నారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు వాడుకొని రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించకుండా కాలయాపన చేస్తోందన్నారు.

## ఆటో బోల్తా... పలువురికి గాయాలు

రేగొండ/భూపాలపల్లి టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తాపడడంతో పలువురికి గాయాలైన సంఘటన భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని దమ్మన్నపేటలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన 40 మంది కూలీలు పత్తి ఏరడానికి జూకల్‌కు బయల్దేరారు. ఈ క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న సిద్ధ కుమారస్వామి, సిద్ధ స్వామి, రాధకు తీవ్ర గాయాలయ్యాయి. మిగతావారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిని వెంటనే అంబులెన్సులో పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు. క్షతగాత్రులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆస్పత్రిలో పరామర్శించారు.



# మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

### భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావ్



వాజేడులో మహిళకు ఇందిరమ్మ చీర అందజేస్తున్న ఎమ్మెల్యే

వెంకటాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలకేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ చీరలను కేవలం మహిళా సంఘాల సభ్యులకే కాకుండా 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ చీరలు అందేలా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి కృషి చేస్తామన్నారు. అనంతరం మరికాల గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, మండల ప్రత్యేక అధికారి సంజీవరావు, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

**మహిళలను కోటీశ్వరులు చేస్తాం**

వాజేడు (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలను కోటీశ్వరులు చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద సోమవారం నిర్వహించిన ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలకు చీరలను పంపిణీ చేశారు. మండల మహిళా సమాఖ్య సంఘాలతో మారుమూల ప్రాంతాల్లో ఉన్న మహిళలకు ఉచిత రుణాలను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 567 సంఘాలు 41 గ్రామాల్లో ఉన్నాయని, ఈ సంఘాల్లో 5670 మంది సభ్యులుగా ఉన్నారని అన్నారు. 2025-26 సంవత్సరానికి రూ. 12.57 కోట్ల ప్రగతిని సాధించినట్లు వెల్లడించారు. వడీకడ లేకుండా 359 సంఘాలు రుణాలు పొందినట్లు ఆయన తెలిపారు. మహిళలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతిని సాధించాలన్నారు. అనంతరం వాజేడులోని 225 మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన రూ. 12.50 కోట్ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఎం.సంపత్‌రావు, ఎంపీడీవో విజయ, ఎంపీవో శ్రీకాంత్ నాయుడు, ఆర్ఐ కుమారస్వామి, నూగూరు ఏఎంసీ వైస్ చైర్మన్ పూనెం రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, సీనియర్ నాయకులు ప్రసాదబాబు రాజు, కాకర్లపూడి కల్యాణ్, మాజీ జడ్పీటీసీ తల్లడి పుష్పలత, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగాసి రమేష్ యాదవ్, చెన్నం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## 28న అస్మితా లీగ్ బాలికల అథ్లెటిక్స్ పోటీలు




వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా స్థాయి అస్మితా లీగ్ బాలికల అథ్లెటిక్స్ 28న నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్ తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఖేలో ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అథ్లెటిక్స్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి మనోజ్‌కుమార్ మాట్లాడుతూ 28న జనగామలోని ధర్మకంచ మినీస్టేడియంలో పోటీలు ప్రారంభమవుతాయన్నారు. అస్మితా లీగ్ ద్వారా క్షేత్ర స్థాయిలో బాలికల్లో క్రీడాసక్తి, ఆత్మవిశ్వాసం, సమాన అవకాశాలను పెంపొందించి భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలకు మహిళా క్రీడాకారిణులను తయారు చేయడమే ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కోశాధికారి ఆవుల అశోక్, తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు జాటోత్ గోర్‌సింగ్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి కైరిక హనుమంతరావు, సభ్యులు పోతర్ల వినోద్, వ్యాయామ దర్శకులు రంజిత్ పాల్గొన్నారు.

## ఐటీడీఏలో గిరిజన దర్బార్



ఐటీడీఏ ఏపీవో వసంతరావుకు వినతులు సమర్పిస్తున్న గిరిజనులు

ఏటూరునాగారం రూరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ జరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజనులు తరలివచ్చి తమ సమస్యలపై ఏపీవో వసంతరావుకు వినతులు సమర్పించారు. వాటిపై సెక్టోరియల్ అధికారులతో ఏపీవో మాట్లాడుతూ గిరిజన దర్బార్‌లో గిరిజనులు దృష్టికి తెచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేయాలని అన్నారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 16మంది గిరిజనులు తమ సమస్యలను ఏపీవో దృష్టికి తీసుకెళ్లారు. తాడ్వాయి, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వాజేడు, గోవిందరావుపేట, మహాముత్తారం, తదితర మండలాల నుంచి గిరిజనులు తరలివచ్చి సీఆర్టీ ఉద్యోగం, పోడుభూములకు పట్టాలు, గిరి వికాస పథకం, రైతు భరోసా, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం తదితర సమస్యలను ఏపీవోకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజ్‌కుమార్, ఎస్‌వో సురేష్‌బాబు, పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జీపీ రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం

కాటారం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీల ఎన్నికల రిజర్వేషన్లలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవిపటేల్ విమర్శించారు. మండల కేంద్రంలో రవి ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక గతంలో ఉన్న 24శాతం కూడా అమలు చేయకపోవడం దారుణమన్నారు. పలిమెల, మహాముత్తారం మండలాల్లో బీసీలకు ఒక్క సర్పంచ్ స్థానం కూడా కేటాయించలేదని మండిపడ్డారు. తక్షణమే కలెక్టర్ చర్యలు తీసుకుని బీసీ స్థానాలు ఉండేలా చూడాలన్నారు.

## టెట్ నుంచి మినహాయించాలి

ఏటూరునాగారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులను టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నుంచి మినహాయించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నియామక సమయంలోనే అన్ని అర్హత ప్రమాణాలను పూర్తిచేసి ఉద్యోగంలో చేరారని గుర్తు చేశారు. ఇప్పటికే అర్హత నిరూపించుకున్న వారిని మళ్లీ పరీక్ష రాయమని అడగడం ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యగా పేర్కొన్నారు. ఈ చర్య విద్యా వ్యవస్థలో అనవసర ఉద్రిక్త వాతవరణాన్ని సృష్టిస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 45 వేలకు పైగా ఉపాధ్యాయులకు టెట్ అర్హత లేదని తెలిపారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన గౌతమ్

## రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థి

జనగామ కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 18న జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచిన జనగామ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం జాటోత్ లచ్చిరాం సోమవారం తెలిపారు. 18న వరంగల్‌లో నిర్వహిచిన అండర్-14 బాలుర విభాగంలో 8వ తరగతి విద్యార్థి జి.గౌతమ్ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. 26 నుంచి 28 వరకు పెద్దపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఆయన పాల్గొంటాడని తెలిపారు. గౌతమ్‌ను పీఈడీ జె.ఉపేందర్, వార్డెన్ బి.హరిచంద్, ఉపాధ్యాయులు రాజయ్య, శత్రు, పరమేశ్వర్, స్వరూప, కవిత అభినందించారు.

## టీజీజీపీవోఏ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్



కాటారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామ పరిపాలన అధికారుల సంఘం (టీజీజీపీవోఏ) రాష్ట్ర కార్యదర్శిగా జంగేడు గ్రామ పరిపాలన అధికారి బండి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. హైదరా బాద్‌లోని బషీర్‌బాగ్‌లో జరి గిన టీజీజీపీవోఏ ఆవిర్భావ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోగా భూపాలపల్లి జిల్లా నుంచి శ్రీనివాస్‌ను రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాటారం మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ భూపాలపల్లి మండలం జంగేడు గ్రామ పరిపాలన అధికారిగా పనిచేస్తున్నారు.

## నిందితుడి ఆచూకీ తెలుపండి: సీఐ



భీమయ్య(ఫైల్)

ఏటూరునాగారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిందితుడి ఆచూకీ తెలుసుకోవడానికి ప్రజలు సహకరించాలని సీఐ శ్రీనివాస్ సోమవారం విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని అల్లవారిఘణపురం, గుర్రాల బావి గొత్తికోయగూడెం గ్రామానికి చెందిన పోడియం భీమయ్య అనే వ్యక్తి ఒక కేసులో నిందితుడుగా ఉన్నారని తెలిపారు. అతడు కొంతకాలంగా కోర్టు ఎదుట హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతుండటంతో, న్యాయస్థానం వారెంట్ జారీ చేసిందని పేర్కొన్నారు. అతడి గురించి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారికి తగిన బహుమతి ఉంటుందని తెలిపారు.

## మద్యం పట్టివేత

చిలుపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మల్కాపూర్‌లో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కెంగర్ల ఆంజనేయులు బెల్టుషాపు నిర్వహిస్తున్నాడు. అక్కడ ఇటీవల కొందరు మందుబాబులు అతిగా మద్యం సేవించి గలాటా సృష్టించినట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేశారు. రూ.18వేల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

## ఎంతమంది పిల్లలున్నా పోటీ చేయొచ్చు

**● గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం ● ఏడేళ్ల పోరాటం ఫలించింది: జేఏసీ అధ్యక్షుడు గాంధీ నాయక్**



గాంధీ నాయక్

కొడకండ్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. ఇద్దరు పిల్లలకు మించి ఉన్నవారు పోటీ చేయకూడదన్న నిబంధనను సెక్షన్ 21/3 చట్టం 1995ను రద్దు చేస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ చట్టం రద్దు కావడంతో ఇక నుంచి ఎంత మంది పిల్లలున్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులయ్యే అవకాశం కలిగింది. రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు గాంధీ నాయక్ ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ఏడు సంవత్సరాల తమ పోరాటం ఫలించిందని, ఇందుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, గవర్నర్‌కు, ప్రతిపక్షాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ చారిత్రక నిర్ణయం లక్షలాది మంది తల్లిదండ్రులకు, స్థానిక రాజకీయాల్లోకి రావడానికి మార్గం సుగమమైందన్నారు.

## జిల్లా స్థాయి అండర్-14బాలుర క్రికెట్ జట్లు ఎంపిక




జిల్లా స్థాయి అండర్-14 బాలుర క్రికెట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26నుంచి జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ జిలా కేంద్రాల్లో నిర్వహించనున్న అంతర్ జిల్లాల అండర్-14 బాలుర క్రికెట్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్న ఉమ్మడి వరంగల్ జిల్లాల స్థాయి క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. సోమవారం వంగపల్లిలోని డబ్ల్యూడీసీఏ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అండర్-14బాలుర విభాగంలో నిర్వహించిన క్రికెట్ ఎంపిక పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 300మంది క్రీడాకారులు పాల్గొన్నారని వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ఇక్కడ నిర్వహించిన ఎంపిక పోటీల్లో బ్యాటింగ్, బౌలింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఒక్కో జిల్లా నుంచి ఒక్కో జట్టుగా ఎంపిక చేశామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 6జిల్లాలకు 6జట్లను ఎంపిక చేసి ఆ జట్ల మధ్య లీగ్ కం నాకౌట్ పద్ధతిన పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన జట్లలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఒక జట్టును ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎంపిక చేయడంతో పాటు త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న అండర్-14 హెచ్‌సీఏ లీగ్ క్రికెట్ పోటీలకు ఎంపిక చేస్తామని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెలక్షన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్, అసోసియేషన్ జిల్లా సంయుక్త బస్వరాజు ఉపేందర్, ఉపాధ్యక్షులు తోట రాము, సభ్యులు అభినవ వినయ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి పదోన్నతులు కల్పించాలి

### సీఎండీకి టీఈఈయూ-1104 విజ్ఞప్తి



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న 1104 నాయకులు

రాంనగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్పీడీసీఎల్‌లోని ఓ అండ్ ఎం, అకౌంట్స్ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు ఇన్‌చార్జి పదోన్నతులు కల్పించాలని కోరుతూ టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డికి సోమవారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ -1104 నాయకులు వినతి పత్రం అందజేశారు. సీఎండీని కలిసినవారిలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేమునూరి వెంకటేశ్వర్లు, డిస్కం సలహాదారుడు శేషగిరారావు, డిస్కం అధ్యక్షుడు రఘునందన్‌రావు, కార్యదర్శి వెంకటరమణరావు, అడిషినల్ కార్యదర్శి ఆరిఫొద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

## బాలికను హత్య చేసిన కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

వరంగల్ లీగల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డువస్తోందని మూడేళ్ల బాలికను హత్య చేసిన కేసులో ఇద్దరికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.2500 జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి వీబీ నిర్మలగీతాంబ సోమవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా రంగశాయిపేట ప్రాంతానికి చెందిన ఎం.డి. ఖాసిం కొన్నేళ్లుగా వ్యాపారం చేసుకొని జీవిస్తున్నాడు. షాపులో పనిచేయడం కోసం ఒకరు కావాలని అదే ప్రాంతానికి చెందిన ఎస్‌కే అబ్బాస్‌కు తెలుపగా సయ్యద్ యూసుఫ్‌ను పరిచయం చేశాడు. యూసుఫ్ పనిలో చేరేటప్పుడు తనకు భార్య హజీరాబేగం, మూడేళ్ల కూతురు సబా ఉందని చెప్పాడు.

ఇదిలా ఉండగా, 2022 ఏప్రిల్ 24న ఉదయం 8 గంటలకు పాప లేవడం లేదని యూసుఫ్ ఏడ్చుకుంటూ ఖాసింకు ఫోన్ చేసి చెప్పగా పాపను ఎంజీఎంకు తరలించారు. అప్పటికే ఆమె చనిపోయిందని డాక్టర్లు నిర్ధారించారు. దీంతో యూసుఫ్ ప్రవర్తనపై అనుమానం రావడంతో ఖాసీం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేయగా యూసుఫ్, హజీరాబేగం భార్యాభర్తలు కాదని, చనిపోయిన పాప హజీరా బేగం కూతురని తేల్చారు. తమ వివాహేతర బంధానికి అడ్డుగా వస్తోందని హత్య చేసినట్లు దర్యాప్తులో నిర్ధారణ అయింది. దీంతో నిందితులు యూసుఫ్, హజీరా బేగంలపై హత్యానేరం నమోదు చేసి మిల్స్‌కాలనీ పోలీసులు కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ జి. శ్రీనివాస్, సీహెచ్.రాజు సాక్షులను ప్రవేశపెట్టగా హరికృష్ణ లైజన్‌అధికారిగా వ్యవహరించారు. దర్యాప్తు అధికారులుగా సీఐలు ముష్క శ్రీనివాస్, బొల్లం రమేష్‌లు వ్యవహరించారు.అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.

## ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ యాట సదయ్య డిమాండ్ చేశారు. నరేంద్రనగర్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌లో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సదయ్య మాట్లాడుతూ... దీర్ఘకాలిక బోధన చేస్తున్న ఉపాధ్యాయులు ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాయాలనడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి ఇన్‌సర్వీస్ ఉపా ధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీవీ రావు, శ్రీధర్, మహేంద్రనాథ్, వంశీ, దేవరాజ్, వినయ్‌కుమార్, శ్రీనివాస్, అశోక్, మణిమాల, సంధ్యశ్రీ, సుధ తదితరులు పాల్గొన్నారు.



బాస్కెట్‌బాల్ ఎంపికలపై తోటబడి వద్ద నిర్వాహకులతో క్రీడాకారుల వాగ్వాదం దృశ్యం

## బాస్కెట్‌బాల్ ఎంపికల్లో గందరగోళం

- అనుమతులు లేకుండా ఎంపిక ప్రక్రియ
- తోట బడి వద్ద పలువురి ఆందోళన
- నిర్వాహకులతో వాగ్వాదం.. పోలీసుల రంగప్రవేశం

హనుమకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా బాస్కెట్‌బాల్ ఎంపిక ప్రక్రియ జరుపుతున్నారంటూ పలువురు క్రీడాకారులు ఆందోళనకు దిగడంతో హనుమకొండ సెయింట్ జోసఫ్(తోటబడి) వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. వివరాల్లోకి వెళితే..

రెండు బాస్కెట్ బాల్ అసోసియేషన్ల మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. పంచాయతీ కోర్టు వరకు వెళ్లింది. ఈ క్రమంలో గుర్తింపు లేనిదిగా చెబుతున్న అసోసియేషన్ బాస్కెట్‌బాల్ ఎంపికలను చేపట్టింది. మొదట హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో ఈ ఎంపిక పోటీలను నిర్వహించాలని భావించినప్పటికీ వివాదం నేపథ్యంలో డీఎస్‌వో అనుమతి ఇవ్వకపోవడంతో వేదికను హనుమకొండలోని తోట బడికి మార్చారు. సోమవారం ఎంపిక పోటీలు జరగనుండగా అక్కడికి వచ్చిన కొందరు ఆటగాళ్లు దీనికి అడ్డుకునే ప్రయత్నం చేశారు. నకిలీ పత్రాలతో సెలక్షన్ కమిటీ పేరిట ఆటగాళ్ల భవిష్యత్తును దెబ్బతీసే విధంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. బాస్కెట్ బాల్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధిగా కూడా కొనసాగుతూ ఇలాంటి కార్యక్రమాలు చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. నిజానిజాలు తేలే వరకు ఈ సెలక్షన్సను తాత్కాలికంగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దీనితో నిర్వాహకులకు, ఆటగాళ్లకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకొని పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలను పోలీసుస్టేషన్‌కు తరలించారు. అయితే ఎలాంటి విచారణ చేపట్టకుండానే ఇరువురిని కాకుండా సాగర్ అనే ఆటగాడిని పోలీసు స్టేషన్‌లో నిర్బంధించి మిగతా వారిని పోలీసులు బయటకు పంపించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# ఏకభుక్తం.. భూతల శయనం..



జనగామలోని అయ్యప్ప ఆలయంలో పడిపూజలో పాల్గొన్న భక్తులు

- అనుక్షణం అయ్యప్ప నామస్మరణం
- భక్తిభావంలో ఓలలాడుతున్న భక్తులు
- జిల్లాలో మార్మోగుతున్న అయ్యప్ప శరణుఘోష

లింగాలఘణపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప నామస్మరణతో పల్లె, పట్టణాలు మార్మోగుతున్నాయి. అయ్యప్ప మాలదారులు భక్తిశ్రద్ధలతో నిష్ఠతో దీక్షను కొనసాగిస్తున్నారు. ఎముకలు కొరికే చలిలో కఠోర దీక్షలకు సిద్ధమైన అయ్యప్ప భక్తులు భక్తిభావంతో ముందుకు సాగుతున్నారు. ఒంటి పూట మాత్రమే సాత్వికంగా భోజనం చేస్తూ, నేలపై శయనిస్తూ మాలదారులు మండల పూజలు చేస్తున్నారు. దీక్ష స్వీకరించిన వారు మండల కాలం(41 రోజులు) కఠోర దీక్షతో స్వామిని కొలుస్తుంటారు. ఒక్కపూట శాఖాహారంతో మాత్రమే భోజనాన్ని స్వీకరిస్తూ, ఆహార నియమాలను పాటిస్తున్నారు. మధ్యాహ్నం భోజనం తర్వాత తిరిగి ఎలాంటి ఆహారం తీసుకోకుండా మళ్లీ రాత్రి పడుకునే ముందు పాలు, పండ్లు లేక సాత్వికమైన అల్పాహారం తీసుకుంటూ నిత్యం ఆధ్యాత్మిక చింతనలో మునిగి తేలుతున్నారు. కామోత్రేరకాలను కలిగించే అల్లం వెల్లుల్లి లాంటి వాటిని పూర్తిగా దూరంగా ఉంచడం విశే షం. వేకువ జామునే లేచి చన్నీటి శిరస్నానం చేసి బ్రహ్మముహూర్తంలో స్వామి వారికి పూజలు చేస్తున్నారు. ఎదురుగా వచ్చే ఎవ్వరినైనా వారి పేర్లతో కాకుండా అయ్యప్పస్వామి పేరుతో పలకరిస్తూ అనుక్షణం అయ్యప్ప నామస్మరణం చేస్తుంటారు.

### యోగాసనం.. పూజా విధానం..



అయ్యప్ప మాల వేస్తున్న గురుస్వామి రాజేశ్వరాచార్యులు

అయ్యప్ప దీక్ష తీసుకున్న ప్రతీ భక్తుడు తనకు తెలియకుండానే ప్రతీరోజు ఉదయం సాయంత్రం యోగాసనం చేస్తుంటారు. అయ్యప్ప స్వామి పూజను మొదలు చేసినప్పటి నుంచి తను చేసే ప్రతీ కదలిక శరీరంలోని ప్రతీ భాగం యోగాసనం చేస్తుంది. పూజ క్రతువులో చేతులు, చేతి వేళ్ల నిర్విరామంగా క్రమపద్ధతిలో పనిచేయడం, రెండు కాళ్లను ముడుచుకుని కూర్చోవడం, అంగపూజ చేస్తున్నప్పుడు పుష్పార్చన చేయడం, అష్టోత్తర శతనామావళి చేస్తున్నప్పుడు అక్షింతలు వేయడం లాంటివి యోగాసనంలో భాగమే అవుతుంటాయి. అదేవిధంగా నమస్కారం శ్లోకం పఠిస్తున్న సమయంలో నిటారుగా నిల్చుని తిరిగి నడుము ను కిందికి వంచడం, భూమాతకు వంద నం చేయడం, సాష్టాంగ ప్రణామం చేస్తున్నప్పుడు మోకాళ్లు నేలకు ఆనకుండా కాలి బొటన వేళ్ల సాయంతో బోర్లాపడుకుని స్వామిని ప్రార్థించడం లాంటి చర్యలు యోగాసనంలో భాగంగా మారిపోతాయి.



ఆలయంలో పడిని వెలిగిస్తున్న అయ్యప్ప భక్తులు

ఉదయాన్నే పూజ ముగిసిన అనంతరం సమీప దేవాలయంలో ప్రదక్షిణలు చేస్తుండటం కూడా మార్నింగ్ వాక్‌గా ఉపకరిస్తుంది. అన్నింటి కంటే ప్రధానమైన అంశం 108 సార్లు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘోషించే శరణు ఘోష శ్వాసను నిలువరిస్తూ శరీరాన్ని, మనసును పూర్తిగా తమ ఆధీనంలోకి తెచ్చుకోవడం కూడా యోగాసనంలో భాగంగానే మారిపోతాయి.

### మహిళలపై మాతృభావం..

అయ్యప్ప దీక్షలో ప్రధానంగా ప్రతీ మహిళను తల్లి సమానంగా భావిస్తారు. భార్యను సైతం మండలకాలం పాటు 41 రోజులు మాతృమూర్తిగా భావించి మాతాస్వామిగా పలకరిస్తూ అయ్యప్పస్వామిని కొలుస్తుంటారు. దీక్ష స్వీకరణ చేసిన ప్రతీ భక్తుడు తనలో అహాన్ని విడిచి తనతోటి వారంతా తనతో సమానమనే భావనను కలిగి ఉండటంతో పాటు పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత పెద్ద చిన్నా, ధనిక పేద తారతమ్యం లేకుండా ప్రతీ ఒక్కరివి పాదపూజ(కాళ్లమొక్కడం)చేసుకోవడం సమానత్వానికి అయ్యప్ప దీక్షా నియమాలు ప్రతీకగా నిలుస్తున్నాయి.



బాణాపురంలో కలశ పూజలు చేస్తున్న అర్చకుడు

### 5వేల మంది మాలదారులు

**కాసోజు రాజేశ్వరాచార్యులు, ప్రధానార్చకులు, అయ్యప్ప దేవాలయం(బాణాపురం) జనగామ**



జనగామ జిల్లా వ్యాప్తంగా సుమారు 5వేల పైచిలుకు మంది అయ్యప్ప దీక్షను స్వీకరించారు. గతంతో పోల్చితే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఉరుకుల పరుగుల జీవితాలతో బతుకుపోరాటంతో నిత్యం కుస్తీపడుతున్న ఎంతో మంది మండలకాలం పాటు దీక్షా స్వీకరణ చేయడంతో ఆధ్యాత్మికత భావం రెట్టింపు కావడంతో పాటుగా ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

### ప్రశాంత జీవనం అలవడుతుంది..

**ధర్మపురి శ్రీనివాస్ – (13వ పాదం) జనగామ**



ఉరుకులు పరుగుల మధ్య బిజీబీజీగా కొనసాగుతున్న వర్తమాన పరిస్థితుల్లో కనీసం కుటుంబ సభ్యులతో తీరికగా గడపలేక పోతున్నాం. దీక్ష చేపట్టి మండలకాలం పాటు నిత్య పూజలు చేస్తూ ఆధ్యాత్మికతలో మునిగితేలుతుంటే ఎంతో హాయిగా ఉంటుంది. గత 13 ఏళ్లుగా దీక్షను చేపడుతూ ప్రతీ ఏటా అయ్యప్ప స్వామిని దర్శించుకుని వస్తుంటాను. మాలధారణ చేపట్టడంతో నాకు మానసిక ప్రశాంతతతో పాటు క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవడుతోంది.



పాకాల ఆయకట్టులో తారిపోతున్న వరి పొలాలు

# తారిపోతున్న వరి పొలాలు

- వరికోత యంత్రాల కొరత
- ఆందోళనలో పాకాల ఆయకట్టు రైతులు

ఖానాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో కూలీల కొరత ప్రధాన సమస్యగా మారింది. సాగులో కూలీల కొరతను అధిగమించేందుకు ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. రైతులకు గిట్టుబాటు కాకనో.. అవగాహన లేకనో.. ఇప్పటికీ ఆధునిక యంత్రాలను కొనుగోలు చేసుకోవడంలో వెనుక బడుతున్నారు. కూలీలు దొరక్క, ఆధునిక యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో సాగు అదను దాటిపోవడం మూలంగా దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక విస్తీర్ణంలో వరి పంటను సాగు చేస్తూ అన్నపూర్ణగా పేరొందిన పాకాల ఆయకట్టులో రైతుల అవసరాలకు సరిపడా వరికోత యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో కోత దశకు చేరుకున్న పంట తారిపోతోంది. పాకాల ఆయకట్టులో వానాకాలం సీజన్‌లో 30వేల ఎకరాల్లో వరిరి సాగు చేశారు. ఎక్కువ విస్తీర్ణంలో సన్న ధాన్యాన్ని సాగుచేశారు. దీంతో 80 శాతం పంట కోత దశకు చేరుకుంది. కూలీల కొరత కారణంగా రైతులు యంత్రాల పైనే(హార్వెస్టర్లు) ఆధారపడ్డారు. ప్రతి ఏటా ఇతర జిల్లాల నుంచి పెద్దఎత్తున పాకాల ఆయకట్టులోకి వరికోత యంత్రాలు వచ్చేవి. ఈ ఏడాది ఇప్పటివరకు రాకపోవడంతో పొలాలు తారిపోయి ఎటుచూసినా ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే వరుస తుఫాన్‌ల తాకిడి కారణంగా పంటలన్నీ దెబ్బతిని నేల వాలడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. కొద్దో గొప్పో పండిన పంటను నూర్పిడి చేసుకుందామంటే వరికోత యంత్రాలు లేక అవస్థలు పడుతున్నారు.

### సాగు ముందుకు..

పాకాల ఆయకట్టులో ప్రతి ఏటా సాగు ఆలస్యంగా ప్రారంభమయ్యేది. దీంతో రైతులు స్టేట్ షెడ్యూల్‌కు నెల రోజుల వెనుకబడి ఉండేవారు. దీని కారణంగా యాసంగి సాగు సైతం ఆలస్యమయ్యేది. ఈ నేపథ్యంలో అధికారులు స్టేట్ షెడ్యూల్‌కు అనుగుణంగా పాకాల ఆయకట్టు రైతులు సాగు పనులు చేపట్టాలని అవగాహన కల్పించారు. ఈ ఏడాది వానాకాలంలో సాగు పనులను ముందుగా ప్రారంభించారు. గతంలో ఆయకట్టు రైతులు సాగు పనులను ఆలస్యంగా చేపట్టడంతో ఇతర జిల్లాల్లో వరికోతలు పూర్తి కాగానే వరికోత యంత్రాలు పాకాలకు వచ్చేవి. ఈ ఏడాది ఇతర జిల్లాల్లో సైతం ఇదే సమయంలో కోతలు నడుస్తుండడంతో పాకాల ఆయకట్టుకు వరికోత యంత్రాలు రాలేని పరిస్థితి దాపురించింది.

### యంత్రాల కొనుగోలులో వెనుకబాటు

వరికోత యంత్రాల కొనుగోలులో పాకాల ఆయకట్టు రైతులు వెనుక బడిపోయారు. ఆయకట్టులో 30వేల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగైంది. పం ట నూర్పిడికి 80నుంచి 120 వరికోత యంత్రాలు అవసరమవుతాయని వ్యవసాయాధికారులు తెలిపారు. కానీ, ఆయకట్టు రైతుల చేతిలో 20 వరికోత యంత్రాలకు మించి లేవు. దీంతో సూర్యాపేట, నల్గొండ, కోదాడ, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ వంటి ప్రాంతాల నుంచి ప్రతీ వానాకాలం సీజన్‌లో పాకాల ఆయకట్టుకు 100 నుంచి 120 వరికోత యంత్రాలు వస్తుంటాయి. ఒక్కో మిషన్ రోజుకు 8 నుంచి 10 ఎకరాల వరకు నూర్పిడి చేస్తుంది. దీంతో 20 రోజుల్లో కోతలు ముగిసేవి. ఈ వానాకాలం సీజన్‌లో ఇతర ప్రాంతాల నుంచి వరికోత యంత్రాలు రాకపోవడంతో ఇక్కడి రైతుల వద్ద వరికోత యంత్రాలు లేకపోవడం వలన పొలాలు తారిపోతున్నాయి. ప్రస్తుతం ప్రతీ రైతు యంత్రాల కోసం ఎదురుచూస్తున్నాడు. ఇతర ప్రాంతాల నుంచి పాకాల ఆయకట్టుకు వరికోత యంత్రాలు వస్తే మంచి గిరాకీ ఉంటుందని రైతులు అంటున్నారు. పాకాల ఆయకట్టు రైతులు సైతం రాబోయే రోజుల్లో అవసరాలకు సరిపడా వరికోత యంత్రాలను కొనుగోలు చేసుకోవాలని, తద్వారా సాగు అదను మించిపోకుండా చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

## బిషప్ జాన్‌మార్కండేయ సేవలు అభినందనీయం

- బ్రదర్ అనిల్‌కుమార్
- ముగిసిన ఆశీర్వాద పండుగలు

కాజీపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బిషప్ జాన్ మార్కండేయ 40 ఏళ్లుగా పేదల కోసం, దైవ పరంగా చేసిన సేవలు అభినందనీయమని, ఆయనకు దేవుడి ఆశీర్వాదం నిత్యం ఉంటుందని బ్రదర్ అనిల్‌కుమార్ అన్నారు. కాజీపేట చౌరస్తా స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహించిన ఆశీర్వాద పండుగలు సోమవారంతో ముగిశాయి. ఈ ఆశీర్వాద పండుగలకు ముఖ్య అతిథిగా బ్రదర్ అనిల్‌కుమార్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హజ్ కమిటీ చైర్మన్, దర్గా పీఠాధిపతి ఖుస్రు పాషా హాజరై ప్రసంగించారు. పేదల కోసం నిత్యం సేవలందిస్తున్న బిషప్ జాన్ మార్కండేయకు ప్రభుత్వం పరంగా సహకారం అందిస్తుందన్నారు. అనంతరం బ్రదర్ అనిల్ పలు క్రైస్తవ గీతాలు ఆలపించారు. తన రాజకీయ గురువు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అల్లుడు బ్రదర్ అనిల్ ఈ పండుగలకు రావడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే నాయిని అన్నారు. క్రైస్తవులంతా కాంగ్రెస్ వైపే ఉంటారన్నారు. ఈ పండగలకు వేలాదిగా హాజరైన క్రైస్తవులను కలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం బిషప్ జాన్ మార్కండేయ దంపతులను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ డైరెక్టర్ నిఖిల్ జాన్, రోజ్‌మేరీ, బైబిల్ మిషన్ వ్యవస్థాపకుడు జీవరత్నం, పాస్టర్‌లు చంద్రమౌళి, కృష్ణతోపాటు క్రైస్తవులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



బ్రదర్ అనిల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని

# మేడారంలో ఎస్పీ పర్యటన



మేడారంలో బైక్‌పై వెళ్తూ రహదారులను పరిశీలిస్తున్న ఎస్పీ



పోలీస్ మెస్ స్థలాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

**జాతర పరిసరాలు, రహదారుల పరిశీలన**

తాడ్వాయి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారంలో ములుగు ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ సోమవారం పర్యటించారు. కొత్తగా బదిలీపై వచ్చిన ఆయన మేడారం పరిసరాలు, రహదారులను పరిశీలించారు. ఇతర పోలీసు అధికారులతో కలిసి బైక్‌పై కలియ తిరిగారు. మహా జాతర నేపథ్యంలో భక్తులకు ఎదురయ్యే సమస్యలపై అధికారులతో చర్చించారు. 2026 మహా జాతరకు 3 కోట్ల మంది భక్తులు వస్తారని అధికారుల అంచనాలకు అనుగుణంగా భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందులో భాగంగా మేడారం పరిసరాలతో పాటుగా కాల్వపల్లి, బయ్యక్కపేట, నార్లాపూర్, కొత్తూరు, ఊరట్టం, కన్నెపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. రోడ్ల విస్తరణ పనులు, మరమ్మతులు, పార్కింగ్ స్థలాలు, వంతెనలు, కాజ్‌వేలు, జాతరలో పోలీసుల అకామిడేషన్ స్థలాలు తదితర పరిశీలించారు. అనంతరం వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్పీ వెంట ఓఎస్డీ శివం ఉపాధ్యాయ, ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్, డీఎస్పీ రవీందర్, సీఐ దయాకర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

### పోలీస్ మెస్, అకామిడేషన్ స్థలాల గుర్తింపు

మేడారం మహా జాతరలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి మెస్ అండ్ అకామిడేషన్ కోసం ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మేడారం,కొత్తూరు, కన్నె పల్లి, నార్లాపూర్, వెంగళాపూర్, రెడ్డిగూడెం, ఊరట్టం గ్రామాల్లో పోలీస్ సిబ్బం ది 11 స్థలాలను గుర్తించారు.వాటిని చదు ను చేసి సిద్ధంగా ఉంచారు. ఈ స్థలాల్లో మహా జాతరలో వసతి, భోజనాల సౌకర్యా లు ఏర్పాటు చేయనున్నారు.

### ప్రముఖుల ప్రత్యేక పూజలు

వనదేవతలను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి భీమగాని యాదగిరితో పాటు పలువురు ఇతర ప్రముఖులు దర్శించుకున్నారు. పూలు,పండ్లు, పసుపు, కుంకుమ, చీర సారెలు, కొబ్బరికాయలు, ఎత్తు బంగారం(బెల్లం) సమర్పించారు. పూజారులు దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్ల ప్రసాదాలు అందించారు.

## ఒక్క క్లిక్‌తో మీసేవ..

- వాట్సాప్‌లో సర్వీసులు ప్రారంభం
- పౌర సేవలు మరింత సులభతరం

తొర్రూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మీసేవ సర్వీసులు ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రభుత్వం పౌర సేవలను వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ డిజిటల్ సేవలను ఈనెల 18వ తేదీన రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఇకపై ఒక్క క్లిక్‌తో 20కి పైగా మీసేవ సర్వీసులు సులభంగా పొందవచ్చు. దీనికిగాను ప్రభుత్వం ఒక ప్రత్యేక వాట్సాప్ నంబర్‌ను ఏర్పాటు చేసింది. వాట్సాప్‌లో 8096958096 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేస్తే వెంటనే రిప్లేలో మెనూ వస్తుంది. కావాల్సిన సేవలను ఎంచుకుని దరఖాస్తు చేసుకోవచ్చు. ఎప్పటికప్పుడు అప్‌డేట్‌తో పాటు ఆమోదం పొందిన సర్టిఫికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించారు. విప్లవాత్మక మార్పులతో ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత సులభంగా వేగంగా అందుతాయని అధికారులు అంటున్నారు.

### అప్లై.. డౌన్‌లోడ్..

అధికారిక నంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేస్తే నమస్కారం. తెలంగాణ మీసేవకు స్వాగతం మీకు ఎలాంటి సేవలు కావాలంటూ రిప్లైలో అందుబాటులోకి వస్తుంది. అందులో మనం ఎంచుకున్న సేవలకు దరఖాస్తు పూరించి అవసరమైన డాక్యుమెంట్‌లు, ఫోటోలు స్కాన్ చేయాల్సి ఉంటుంది. సూచించిన యూపీఐ ద్వారా ఫీజును సురక్షితంగా చెల్లించుకోవచ్చు. ఆతర్వాత దరఖాస్తు స్టేటస్, అప్‌డేట్, అన్ని వాట్సాప్‌లోనే మెసేజ్ రూపంలో వస్తాయి. ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులను అధికారులు ధృవీకరణ పత్రాలను పరిశీలించి అర్హత మేరకు డొంగల్ ద్వారా జారీ చేస్తారు. సర్టిఫికెట్ సిద్ధం కాగానే డౌన్‌లోడ్ లింక్ ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. దానిని క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసి పీడీఎఫ్ రూపంలో సేవ్ చేసుకోవచ్చు. ఇదేకాక మరో 500 రకాల సేవలు వాట్సాప్ ద్వారా అందుబాటులోకి వస్తాయని ప్రస్తుతం సర్టిఫికెట్‌లు పొందడానికి అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# జీపీవోలు ఎక్కడ..?

- ప్రశ్నార్థకంగా మారిన జీపీవోల పనితీరు
- పేరుకే గ్రామ పాలన.. సేవలు ఎక్కడ..!
- గ్రామాల్లో జీపీవో ఎవరో తెలియని పరిస్థితి
- సర్టిఫికెట్ల కోసం మండల కేంద్రాలకే వస్తున్న ప్రజలు
- సాదాబైనామాల పనిలోనే ఉన్నారంటున్న అధికారులు


వర్ధన్నపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం గ్రామ రెవెన్యూ అధికారి(వీఆర్‌వో) వ్యవస్థను తీసివేసి, వారిని ఇతర శాఖల్లోకి పంపించింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ ఆ వ్యవస్థను పునరుద్ధరించి, కొత్తగా గ్రామ పాలన అధికారి (జీపీవో)గా నామకరణం చేశారు. ఈ ఏడాది సెప్టెంబరు మాసం నుంచి వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జీపీవోలు విధుల్లో చేరారు. గతంలో వీఆర్వోలు పనిచేసే పనులనే మళ్లీ అప్పగించి, గ్రామీణ స్థాయిలో ఉన్న ప్రజలకు చేరువలో ఉండేలా చేశారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు వెయ్యికి పైగా రెవెన్యూ గ్రామాలు ఉండగా, అన్ని చోట్ల జీపీవోలను నియమించారు. కానీ, జీపీవోల పనితీరు ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. జీపీవోలు ఎలా ఉంటారో కూడా తెలియదని గ్రామాల ప్రజలు చెపుతుండడంతో విడ్డూరంగా మారింది.

### జీపీవోల పనితీరుపై గందరగోళం

వీఆర్వో వ్యవస్థ ఉన్న సమయంలో గ్రామాల ప్రజలు నేరుగా వారి పనిపై వెళ్లేవారు. కానీ, ఇప్పుడు వచ్చిన జీపీవో వ్యవస్థలో ఏం పనులు చేసుకోవాలో అర్థం కావడంలేదని గందరగోళానికి గురవుతున్నారు. దీనికి తోడు జీపీవో గ్రామాల్లో కనిపించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో గ్రామాల్లో జరిగే పనుల కోసం ఇప్పటికీ మండల కేంద్రంలోని కార్యాలయానికి వస్తున్నారు. జీపీవోలు గ్రామీణస్థాయిలో ఉండే ప్రజలకు కులం, ఆదాయం, నివాసం, రేషన్ కార్డు, భూ సమస్యలు, భూ వివరాలు, కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం, ఉపాధి సర్టిఫికెట్లు, నివాస ధ్రువీకరణ పత్రం, పేదరిక ధ్రువీకరణ, రెవెన్యూ కేసుల్లో సహకారం, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న రెవెన్యూ వ్యవస్థలోని పనులన్నింటినీ జీపీవో స్థాయి నుంచి చేయాల్సి ఉంటుంది.

### కార్యాలయాల్లోనే జీపీవోలు

గ్రామ పాలన అధికారులు భూ భారతి కార్యక్రమంలోని సాదాబైనామాకు సంబంధించిన దరకాస్తులను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో గ్రామీణస్థాయిలో అందించాల్సిన పాలనకు పంగనామాలు పెట్టారనే ఆరోపణలు వస్తున్నాయి. గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉండాల్సిన అధికారులు కనిపించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజంతా కార్యాలయంలో కూర్చుంటే గ్రామ సమస్యలు ఎలా తెలుస్తాయని వాపోతున్నారు. సర్టిఫికెట్ల కోసం వారాల తరబడి తిగాల్సి వస్తోందని చెపుతున్నారు. జీపీవో ఎంత మంది ఏ గ్రామాల్లో ఎవరెవరు పనిచేస్తున్నారు? నెల వారీ సమీక్షలు లేకపోవడంతో రెండు నెలలు గడిచినా జీపీవో జాడ కనిపించడం లేదు. జీపీవో సంతకానికి గ్రామం నుంచి మండల కేంద్రంలోని కార్యాలయంలో వచ్చి అడగాల్సిన పరిస్థితి దాపరించింది.



వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో ఫైళ్లను చూస్తున్న జీపీవోలు

### గ్రామ పాలనలో బాధ్యతలు లేకపోతే ఎలా..

గ్రామస్థాయి పాలన అంటే ప్రజలకు దగ్గరగా ఉండే పరిపాలన. అక్కడే అధికారుల హాజరుకాకపోతే, ఫీల్డ్ పరిశీలన లేకపోతే, ఫిర్యాదు పరిష్కారం లేకపోతే పాలన పేరు మాత్రమే మిగులుతుంది. జీపీవోల హాజరుతో మండల అధికారుల దృష్టి సన్నగిల్లినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. రోజువారీ కాకున్నా, వారానికోసారైన సమీక్ష లేకపోవడంతో కొత్త జీపీవోలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. గ్రామానికి వారంలో కనీసం 3 రోజుల పాటు అందుబాటులో ఉండాలనే నిబంధన తుంగలో తొక్కారు. జీపీవోలు వచ్చినా కులం, ఆదాయం సర్టిఫికెట్ల జారీలో వారాల తరబడి తిరగాల్సి వస్తోంది. దీంతో న్యాయం కావాలంటూ ప్రజలు ప్రజాప్రతినిధులు, నాయకులు, మండల అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. జీపీవో సంతకం చేయనిదే పై అధికారుల టేబుల్ వరకు ఫైల్ కదలడం లేదు.

### ఉన్నతాధికారుల నిర్లక్ష్యం..

జీపీవోల పనితీరు పట్ల ఉన్నతాధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాల పై అధికారులతో మాట్లాడాల్సిన జీపీవోలు కార్యాలయాల్లో సాదాబైనామా, భూ భారతి పేరుతో ఫైళ్లను ముందట వేసుకుని కూర్చుంటున్నారు. వీటిని గమనించాల్సిన తహసీల్దార్లు కుర్చీకే పరిమితమై కార్యాలయ వివిధ విభాగాల్లో ఏం జరుగుతుందో కనీసం చూడడం లేదు. వారి కార్యాలయాల్లో ఉన్న విభాగాల్లో పరిస్థితిని నేరుగా కూడా చూడకపోవడంతో, ఇక మండలంలోని ఆయా గ్రామాలపై ఎలాంటి శ్రద్ధ ఉంటుందని మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీవో వ్యవస్థను ప్రజల్లోకి తీసుకెళ్లి వారి విధులను గుర్తుచేస్తూ ప్రజల సమస్యలను ఏకరువు పెట్టడంతో, ఉన్నతాధికారులు కూడా నిర్లక్ష్యం వహిస్తే ప్రజలు మరింత ఆగ్రహం వ్యక్తం చేసే అవకాశం ఉంది.

# మహిళలను కోటీశ్వరులు చేస్తాం

**స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**

మంగపేట నవంబరు24 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆమె మహిళలకు సోమవారం చీరలు పంపిణీ చేశారు. కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఇందిరా మహిళా క్యాంటిన్లు, కారంపొడి మిషన్లు, ఎలక్ట్రిక్ బస్సులు వంటివి మహిళా సంఘాలకు కేటాయించి వారి ఆర్థిక పురోగతికి కాంగ్రెస్ ప్రభుత్వం చేయూతనందిస్తోందని తెలిపారు. జిల్లా కేంద్రమైన ములు గులో రూ. 5 కోట్ల నిధులతో మహిళా శక్తి భవనం నిర్మిస్తున్నామన్నారు. మంగపేట మండలంలోని మహిళా సంఘాలకు సుమారు రూ. 33 కోట్ల వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడంతో పాటు రూ. 30 లక్షల విలువ చేసే ఎలక్ట్రిక్ బస్సును ఇచ్చినట్లు తెలిపారు. అలాగే అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి మహిళలకు చేయూతని స్తున్నామన్నారు. అనంతరం రైతు వేదిక నుంచి కస్తూర్బాయి వృద్ధాశ్ర మంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, కలెక్టర్ దివాకరతో కలిసి వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ తోట రవీందర్, ఎంపీడీవో భద్రు, ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కల్యాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాసిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా అయ్యోరి అధికార ప్రతినిధి యానయ్య, వర్కింగ్ కమిటి ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, బీసీ సెల్ అధ్యక్షుడు ఆదినారాయణ, మైనారిటీ సెల్ అధ్యక్షుడు హిదాయతుల్లా సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి కర్రి నాగేంద్రబాబు పాల్గొన్నారు.



మంగపేటలో చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్

**గొత్తికోయగూడాల్లో సోలార్ విద్యుత్**

ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి గొత్తికోయగూడాల్లో సోలార్ విద్యుత్, బోర్ వెల్స్ ఏర్పాటు చేస్తామని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండలంలోని బూటారం గొత్తికోయగూడెంలో రిలియబుల్ ట్రస్ట్ హైదరాబాద్ వారి సహకారంతో చింతలపాడు, గుండంగావాయి, గంటలకుంట గొత్తికోయలకు 208 బ్లాంకెట్స్, స్వెటర్లను జిల్లా కలెక్టర్ దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణిలతో కలిసి మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రిలియబుల్ ట్రస్ట్ సహకారంతో బ్లాంకెట్స్, స్వెటర్లను ఆదివాసీలకు అందించినట్టు తెలిపారు. అటవీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలకు సేవ చేయాలని ఆలోచనతో ముందుకు వచ్చిన ట్రస్ట్ వారిని మంత్రి ప్రశంసించారు. అనంతరం మండల కేంద్రంలోని గిరిజన భవనంలో వండల పరిధిలోని మహిళా సంఘాలకు మంత్రి చేతుల మీదుగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రూ. 9 కోట్ల 50 లక్షల రుణాల చెక్కులను అందజేశారు. 17 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు డీఆర్‌డీవో శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ. ఖలీల్ ఖాన్, మాజీ జడ్పీటీసీ గాంధీ, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్నఎల్లయ్య, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, వావిలాల నర్సింహారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**ప్రజాపాలనలో మహిళల ఆర్థికాభివృద్ధి**

రేగొండ (ఆంధ్రజ్యోతి) : రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలనలో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి ఆమె కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో చీరల పంపిణీ చేశారు. మహిళల సాధికారతే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాలకు రూ 27వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని తెలిపారు. మహిళలకు ఉపాధి కల్పనకు కొత్తపల్లిగోరి, చిట్యాల, గణపురం, శాయంపేట మండలాలలో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కలెక్టర్ రాహుల్‌శర్మ, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, సీనియర్ నాయకులు ఎన్ఎస్ఆర్ సంపత్‌రావు, ఇప్పకాయల నర్సయ్య, మోడెం ఉమేష్‌గౌడ్, మటిక సంతోష్, వీరబ్రహ్మం, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

**మహిళలకు ఆర్థిక తోడ్పాటు**

కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి) : కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయటమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి సీతక్క అన్నారు. మహిళల కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తూ ఆర్థికంగా తోడ్పాటును అందిస్తోందన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి సీతక్క పర్యటించారు. మండల కేంద్రలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ చీరలు, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. కలెక్టర్ దివాకరతో కలిసి మంత్రి హాజరయ్యారు. మండలానికి మహిళా సంఘం బిల్డింగ్ కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ రేగా కల్యాణి, సెర్ప్ పీడీ శ్రీనివాస్, తహసీల్దార్ సర్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అఫ్సర్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా నగర కీర్తన



నగర కీర్తనలో అయ్యప్ప స్వాములు

మంగపేట నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప స్వాముల నగర సంకీర్తన మండల కేంద్రంలో సోమవారం వైభవంగా జరిగింది. గురుస్వామి పిల్లలమర్రి కరుణాకర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గంపోనిగూడెం చేరుకున్న అయ్యప్ప స్వాములు ఉత్సవ మూర్తులతో ఊరేగింపు నిర్వహించారు. కోమటిపల్లి క్రాస్ రోడ్డు, మంగపేట బస్టాండ్ మీదుగా ఉమాచంద్రశేఖర స్వామి దేవస్థానం వరకు ఇది కొనసాగింది. గ్రామస్థులు ఎదురేగి స్వామి వారి ఉత్సవ మూర్తులకు కొబ్బరి కాయలు కొట్టి మొక్కుకున్నారు.

## మైక్రో ఫైనాన్స్ మాఫియా ఆగడాలను అరికట్టాలి

గోవిందరావుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో మైక్రో ఫైనాన్స్ మాఫియా ఆగడాలను అరికట్టాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహనాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఆయన మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో కొందరు వ్యక్తులు కలిసి ముఠాగా ఏర్పడి అమాయక ప్రజల అవసరాలను అవకాశంగా మలచుకుని వారికి రుణాలు ఎక్కువ వడ్డీకి ఇప్పించి కమీషన్ రూపంలో వేలరూపాయలు కాజేస్తున్నారని ఆరోపించారు. ఆర్థిక స్తోమత సరిగాలేని ప్రజలు అప్పులు తీర్చడానికి మరొక అప్పు చేసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. మైక్రో ఫైనాన్స్ మాఫియా ఆగడాలు భరించలేక గతంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అమాయక ప్రజల ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయని అన్నారు. ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం కాకముందే ప్రభుత్వం మేల్కొని మైక్రో ఫైనాన్స్ ఆగడాలను నిలువరించాలని ఆయన కోరారు.

## పేదలకు అండగా కాంగ్రెస్

ఏటూరునాగారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఎల్లప్పుడూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఎంపల్లి మురళి ఇటీవల మృతి చెందగా పార్టీ నాయకులతో కలిసి రఘు సోమవారం దశదిన కార్యక్రమానికి హాజరయ్యారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మృతుడి కుటుంబానికి 50 కేజీల బియ్యం, రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీని వాస్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్నఎల్లయ్య, మాజీ జడ్పీటీసీ చందు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎమ్డీ. సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

## 'రణభేరి' బహిరంగ సభను విజయవంతం చేయాలి

వెంకటాపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న సూర్యాపేటలో నిర్వహించనున్న రణభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మునిగాల సుధాకర్‌గౌడ్ కోరారు. మండల కేంద్రంలోని తాళ్లపాడులోని రేణుక ఎల్లమ్మగుడి ఆవరణలో సోమవారం జరిగిన సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పులి రమేష్‌గౌడ్, మునిగాల సురేష్‌గౌడ్, గునిగంటి శోభన్, మునిగాల వెంకటేష్, మండ రాజు, దొమ్మటి రాజసమ్మయ్య, మునిగాల శంకరయ్య, పోశాల చిరంజీవి, రవి, చంద్రమోహన్, శ్రీనివాస్, మహేందర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎంతోనే గ్రామాల అభివృద్ధి

**రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి**

గోవిందరావుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీపీఎంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పస్రాలో పార్టీ గ్రామస్థాయి సమావేశం కడారి నాగరాజు అధ్యక్షతన సోమవారం జరగగా కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీపీఎం తరఫున పస్రా సర్పంచ్ అభ్యర్థిగా గొంది రాజేష్‌దేవేంద్రను ప్రకటించినట్లు పేర్కొన్నారు. సీపీఎం ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందని, పస్రాలో 40ఏళ్లుగా ప్రజల పక్షాన నిలబడిందని పేర్కొన్నారు. ప్రజల ఐక్యతను కాపాడడంతోపాటు రైతుకూలీల పక్షాన నిలబడి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, పంటలకు గిట్టుబాట ధర కావాలని అనేక పోరాటాలు చేపట్టిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామపంచాయతీల పాలన పూర్తి అవినీతిమయంగా మారిందని, పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని, గ్రామాభివృద్ధి కుంటుపడిందని, పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్వీర్యమైందని, అంతర్గత రోడ్ల అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. సీపీఎం అభ్యర్థి రాజేష్‌దేవేంద్రను గెలిపించడం ద్వారా గ్రామ ప్రజలు తమ హక్కులను సాధించుకోవచ్చని పేర్కొన్నారు. ఈసమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుమ్మల వెంకటరెడ్డి, పొదిళ్ల చిట్టిబాబు, జిల్లా కమిటీ సభ్యులు సోమ మల్లారెడ్డి, తీగల ఆగిరెడ్డి, నాయకులు అంబాల మురళి, క్యాతం సూర్యనారాయణ, ముమ్మడి ఉపేంద్రచారి, రెడ్డి పురుషోత్తంరెడ్డి, జిట్టబోయిన రమేష్, కందుల రాజేశ్వరి, మంచాల కవిత, సువర్ణ, ధర్మారెడ్డి, ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అందెశ్రీ సంస్మరణ సభ

ములుగు టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కవి అందెశ్రీ సంస్మరణ సభ జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కమ్యూనిటీ హాల్‌లో జిల్లా కళాకారుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు గోల్కొండ బుచ్చన్న మాట్లాడుతూ పశువుల కాపరిగా మొదలై లోక కవిగా, రాష్ట్ర గీతాన్ని అందించిన మహా కవి అందెశ్రీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఇరుగు పైడి, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ భిక్షపతి గౌడ్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి శ్యాంబాబు, అంబేదక్కర్ సంఘం జిల్లా నాయకుడు చంటి భద్రయ్య, దళిత సంఘం నాయకుడు బొచ్చు సమ్మయ్య, జన్ను రవి, కెవిపిఎస్ అధ్యక్షుడు రత్నం ప్రవీణ్, కళాకారులు పోరిక శ్యామల్ నాయక్, రాగుల శంకర్, రేలా విజయ్, రహిమొద్దీన్, అమ్మపాట తిరుపతి, పత్తిపల్లి రాజేందర్, కొడిమల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

ములుగు టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రేమ్‌నగర్ వద్ద ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు సోమవారం పెను ప్రమాదం తప్పింది. వరంగల్-2 డిపోకు చెందిన బస్సు హనుమకొండ నుంచి ఏటూరునాగారం వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. ప్రేమ్‌నగర్ వద్ద ముందు వెళ్తున్న ఇసుక లారీ సడన్ బ్రేక్ వేయడంతో బస్సు డ్రైవర్ వెంటనే అప్రమత్తమై బ్రేక్ వేశాడు. దీంతో అదుపు చేయడంతో 50 ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం స్వల్పంగా ధ్వంసం కాగా ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.



## మంత్రి శ్రీధర్‌బాబుకు కాంగ్రెస్ నేతల వినతి

కాటారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో 353(సీ) జాతీయ రహదారిపై ఉన్న నస్తూరుపల్లి స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సులు ఆపేలా కృషి చేయాలని కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నిట్టూరి దేవేందర్, గ్రామస్థులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలో పర్యటించిన మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. దీంతో వెంటనే మంత్రి శ్రీధర్‌బాబు ఆర్టీసీ ఆర్‌ఎం, డీఎంలతో ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారని దేవేందర్ తెలిపారు.

## ట్రాన్స్‌కో డీఈఈగా నాగరాజు



కాటారం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కాటారం విద్యుత్ శాఖ నూతన డివిజన్ డీఈఈ (ఆపరేషన్స్)గా దీకొండ నాగరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 మంది ఏడీఈలకు డీఈఈలుగా పదోన్నతి రాగా నాగరాజుకు నూతనంగా విద్యుత్ డివిజన్‌గా ఏర్పడ్డ కాటారానికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మండల కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఎస్ఈ మల్సూర్‌నాయక్ సమక్షంలో నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. కాటారం ఏడీఈగా నాగరాజు 2022 నుంచి విధులు నిర్వర్తిస్తుండగా డీఈఈగా పదోన్నతి వచ్చింది. నాగరాజును ఏఈఈలు శ్రీకాంత్, శేఖర్, మంగీలాల్, ప్రశాంత్, లైన్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కాంత్, లక్ష్మీనారాయణ, కుమారస్వామి, బిక్యానాయక్, సబ్ ఇంజనీర్లు చందర్‌రెడ్డి, రాజ్‌కుమార్, కొమురయ్య, కుమార్, లైన్‌మన్లు చంద్రమౌళి, తిరుపతి, జేఎల్‌ఎంలు శ్రీకాంత్, రమేష్, రాజేందర్, శ్రీనివాస్, విద్యుత్ సిబ్బంది తదితరులు సన్మానించారు.

## ప్రజావాణిలో నిర్వాసితుల వినతి

మల్హర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : తాడిచర్ల ఓసీపీ డేంజర్ జోన్ పరిధిలోని ఇళ్లు, భూములు సేకరించి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని అధికారులను నిర్వాసితులు కోరారు. ఈ మేరకు సోమవారం భూపాలపల్లిలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో పూర్వం నుంచి నివసిస్తున్న కుటుంబాలను నష్టం జరగకుండా పరిహారం ఇవ్వాలన్నారు. ఈ నెల చివరి వరకు సమస్యను పరిష్కరించకుంటే కేటీపీపీకి బొగ్గు వెల్లకుండా లారీలను అడ్డుకుంటామన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

కాటారం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకాని జడ్పీహెచ్‌ఎస్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం శైలజ, టీచర్లు, విద్యార్థులు, నిర్వాహకులు ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం శైలజ, డీహెచ్‌ఈడబ్ల్యూ, సఖి, సీహెచ్‌ఎల్ ప్రతినిధులు అనూష, మాధవి, సాయిరాం మాట్లాడుతూ లింగ వివక్ష పాటించడం, బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. జిల్లాను బాల్యవివాహాల రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యం కావాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు 'మీసేవ' ఆపరేటర్ల వినతి

కృష్ణకాలనీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మకు తెలంగాణ మీసేవ అపరేటర్స్ అసోసియేషన్స్ ప్రతినిధులు సోమవారం వినతిపత్రం అందజేశారు. వాట్సాప్‌లో మీసేవ సౌకర్యాలు కల్పించినప్పటికీ మళ్లీ అదనంగా మీసేవ కేంద్రాల సెంటర్ల కోసం నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. జిల్లాలో నూతన మీసేవ కేంద్రాల ఏర్పాటుకు ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరారు. 14 ఏళ్లుగా ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరవేయడానికి సేవలు అందిస్తున్నామని, పదేళ్లుగా తమకు కమిషన్ పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు ఎక్కువగానే మీసేవ కేంద్రాలు ఉన్నాయని, అయినప్పటికి మళ్లీ కొత్త సెంటర్లకు నోఫిఫికేషన్ ఇవ్వడం సబబుకాదన్నారు. ఈ కార్యక్రమంలో మీసేవ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త కిరణ్‌కుమార్, ఆయా సెంటర్ల నిర్వాహకులు సిరికొండ రమారావు, గౌరోజు విష్ణుమూర్తి, తోట అనూష, వెలుగుల చైతన్య, పసుల రఘుపతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

చిట్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నవాబుపేట, గోపాలపురం గ్రామాల్లో ఇందిర మహిళా శక్తి చీరలను చిట్యాల ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి సోమవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అనేక సంక్షేమ పథకాల అమలుతో పెద్దపీట వేస్తోందన్నారు. ఈకార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాజేందర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు దొడ్డి కిష్టయ్య, పింగిలి జ్యోతి, మూల శంకర్‌గౌడ్, బుర్ర శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, నాయకులు ఏరుకొండ గణపతి, తీర్థాల సుదాకర్ తదితరులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరంలో సెర్ప్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజుబాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాణిబాయి, నాయకులు బందెత సత్తెమ్మ, గుండెకారి సత్యం, లేతకారి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా 24 గ్రామ పంచాయతీల పరిధిలో స్వయంసహాయక సంఘాల మహిళలకు ఇందిరా మహిళాశక్తి చీరల పంపిణీ జరిగింది. ఎంపీడీవో బాబు, ఏపీఎం రవీందర్ నేతృత్వంలో జీపీ కార్యదర్శులు, ఐకేపీ



కాళేశ్వరంలో చీరలు పంపిణీ చేస్తున్న కోట రాజబాబు

అధికారులు, సిబ్బంది, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు ఎస్‌హెచ్‌జీ మహిళలకు చీరలను అందించారు. మండలంలో 8,795 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులుండగా వారందరికీ చీరలను పంపిణీ చేస్తున్నట్లు ఏపీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సీసీలు, వీవోఏలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పన్నుల అవకతవకలపై విచారణ చేయాలి : బీఆర్ఎస్

కాటారం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం జీపీ పరిధిలో 2017-2021 మధ్య ఇంటి పన్ను వసూళ్లలో జరిగిన అవతవకలపై సమగ్ర విచారణ చేయాలని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం గంగారంలో పలువురు గ్రామస్తులను కలిసి ఇంటి పన్ను వసూళ్లపై జరిగిన మోసాలను తెలుసుకున్న అనంతరం కిరణ్ మాట్లాడారు. ఎక్కడ లేని విధంగా సాధారణ ఇంటికి సైతం లక్షలాది రూపాయల హౌస్ ట్యాక్స్ వసూలు చేసి ఖజానాలో జమ చేయకుండా సొంతంగా వాడుకున్నారని ఆరోపించారు. ఈ అంశంపై కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించి అవినీతికి పాల్పడింది అధికారుల, నాయకుల అనేది తేల్చాలని డిమాండ్ చేశారు. ప్రజా ధనాన్ని ప్రజలకు తిరిగి ఇప్పించడమో లేదా ప్రభుత్వ ఖజానాకు జమచేయడమో చేయాల న్నారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ నేతలు చల్ల శేఖర్, జిముడ వంశీ తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ నియంత్రణపై అవగాహన

కాటారం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం కుటుంబనియంత్రణపై అవగాహన సమావేశం నిర్వహించారు. వేసక్టమీ శస్త్ర చికిత్సల పక్షోత్సవాలను పురస్కరించుకుని పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలకు వైద్యాధికారి డాక్టర్ మౌనిక అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన, సంతోషకరమైన కుటుంబంలో పురుషుల భాగస్వామ్యం ఎంతో ఉంటుందన్నారు. పురుషులకు కుట్టు, కోతలేని వేసక్టమీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ఎంతో సులువుగా సురక్షితమైందన్నారు. వైద్యసిబ్బంది గ్రామాల్లో వేసక్టమీ, మహిళలకు చేసే ట్యూబెక్టమీ ఆపరేషన్లపై అవగాహన కల్పించి భూపాలపల్లి 100పడకల ఆస్పత్రిలో డిసెంబరు 4వ తేదీ వరకు నిర్వహించే వేసక్టమీ ఆపరేషన్ల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సాహిం చాలన్నారు. ఈ సమావేశంలో హెచ్ఎస్ పద్మావతి, హెల్త్ అసిస్టెంట్లు సమ్మయ్య, సుజాత, లక్ష్మి, రాణి, రజిత, శ్యామల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 24 జీపీలు.. 30,785 మంది ఓటర్లు

కాటారం, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలో 30,785 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. మండలవ్యాప్తంగా 210 వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. పంచాయతీల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఒక కుటుంబానికి చెందిన సభ్యులంతా ఒకే వార్డులో ఉండేలా వార్డుల వారీగా ఓటర్ల లెక్క సిద్ధమయింది. మండలంలో 15,894మంది మహిళ ఓటర్లు, 14,883 మంది పురుష ఓటర్లు, 8మంది ఇతర (ట్రాన్స్‌జెండర్లు)ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. కాటా రం జీపీలో 14వార్డులుండగా అత్యధికంగా 6,459మంది ఓటర్లు, నస్తూరుపల్లి జీపీలో అత్యల్పంగా 6వార్డుల్లో 342మంది ఓటర్లున్నారు. దామెరకుంట జీపీలో 10వార్డుల్లో 2,433, రేగులగూడెం 10వార్డుల్లో 2,046, గంగారం 10వార్డుల్లో 2,052, చింతకాని10వార్డుల్లో 1,579, కొత్తపల్లి 10వార్డుల్లో 1,439, శంకరంపల్లి 10వార్డుల్లో 1362, చిద్నెపల్లి 10వార్డుల్లో 1,401, జాదరావుపేట 10వార్డుల్లో 1,270, ఇబ్రహీంపల్లి 10వార్డుల్లో 1,157, ధన్వాడ జీపీ8 వార్డుల్లో 1,136, అంకుసాపూర్ 8వార్డుల్లో 1,046, ఒడిపిలవంచ 8 వార్డుల్లో 877, విలాసాగర్ 8వార్డు ల్లో 965, బయ్యారం 8వార్డుల్లో 850, గుమ్మళ్లపల్లి 8వార్డుల్లో 709,ఆదివారంపేట 8వార్డుల్లో 694, ప్రతాపగిరి 8వార్డుల్లో 673, గుండ్రాత్‌పల్లి 8వార్డుల్లో 646, ధర్మసాగర్8వార్డుల్లో 444, మేడిపల్లి 8వార్డుల్లో 432, వీరాపూర్ 6వార్డుల్లో 395, మద్దులపల్లి 6వార్డుల్లో 378మంది ఓటర్లున్నారు. మద్దులపల్లి జీపీలో 7మంది, బయ్యారం జీపీ పరిధిలో ఒకరు ఇతర ఓటర్లు ఉన్నారు. మండలవ్యాప్తంగా పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లు 1,011మంది అధికంగా ఉండటం విశేషం.

## వందేమాతరం దేశభక్తికి ప్రతీక : బీజేపీ

ఏటూరునాగారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశభక్తికి, స్వాతంత్ర్య పోరాటంలో సమరయోధుల నినాదానికి వందేమాతరం గేయం ప్రతీక అని బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు వినుకొల్లు చక్రవర్తి ఆధ్వర్యంలో సోమవారం వందేమాతరం 150వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బలరాం హాజరై మాట్లాడుతూ.. 1875లో బలకిం చంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం గేయాన్ని స్మరించుకుంటూ జాతీయ కార్యక్రమాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. వందేమాతరం కేవలం ఒక పాట మాత్రమే కాదని, అది దేశభక్తికి, స్వాతంత్ర్య సమరయోధుల నినాదానికి ప్రతీక అని ప్రధాని పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. చారిత్రక నేపథ్యాన్ని వివరిస్తూ వందేమాతరం మొదటిసారిగా 1882లో ప్రచురించబడిందని, 1950లో భారత జాతీయ గీతంగా అధికారికంగా స్వీకరించబడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్‌లు యాప సీతయ్య, అజ్మీర కృష్ణవేణి నాయక్, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోతు సరూప, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు పళ్ళ బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి పెద్ద పీట

(5వ పేజీ తరువాయి)

ఇందిరమ్మ చీరలను పంపి ణీ చేశారు. అనంతరం జంగాలపల్లిలో రూ. 20 కోట్లతో గాంధీనగర్ వర కు చేపడుతున్న రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాలనను ఆదర్శంగా తీసుకుంటూ ప్రస్తుత రేవంత్ సర్కారు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మొట్ట మొదటగా మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. ఆర్టీసీ బస్సులకు మహిళలనే యజమానులుగా చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. ములుగు ప్రాంత అభివృద్ధిపై సీఎంతోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. అనంతరం మండలంలోని అబ్బాపూర్ గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి తుల రవి, ఏపీఎం శ్రీనివాస్, రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కొటాక్ మహేంద్ర ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి స్వాతి, కాంగ్రెస్ జిల్లా ప్రచార కార్యదర్శి నూనేటి శ్యామ్ యాదవ్, జగ్గన్నపేట కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ముత్తినేని సదానందం, మహిళా సంఘం సీఏ అజ్మీరా వనిత తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు వడ్డీ లేని రుణాలు

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. ఈ క్రమంలోనే ఈ నెల 25న ఒకేసారి రాష్ట్ర వ్యాప్తంగా వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కలెక్టర్లు చీరల పంపిణీ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించారని, మహిళలు ఆనందంగా ఉన్నారని అన్నారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ జిల్లాలోని 6,107 స్వయం సహాయక సంఘాలకు రూ.3.20 కోట్లు వడ్డీలేని రుణాలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం మొగుళ్లపల్లి మండలంలోని అమ్మ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫ రెన్స్‌లో ఆదనపు కలెక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

మహదేవపూర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆర్.రాజేంద్రప్రసాద్, అధ్యక్షుడిగా హైదర్, ప్రధాన కార్యదర్శిగా ఆర్.నాగరాజు, ఉపాధ్యక్షులుగా శ్రావణ్, ఎన్.సంతోష్, సంయుక్త కార్య దర్శిగా సడువలి, జాయింట్ సెక్రటరీగా ఎస్‌కే.దీన్, కోశాధికారిగా కె.మహేష్, కార్యవర్గ సభ్యులుగా ఎ.భాస్కర్, సంపత్‌కుమార్, భాస్కర్‌రెడ్డిని ఎన్నుకున్నారు.